

పీఎం కిసాన్ - అన్నదాత సుఖీభవ
నిధులు రైతులకు విడుదల


అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..



WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
JV NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103



సంపుటి - 2 సంచిక - 218 గురువారం20 నవంబర్ 2025 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Districts


## సత్యసాయి సాయి ప్రేమ, సేవా మార్గం

# ప్రపంచానికి ఆదర్శం







### సర్వమానవ సంక్షేమమే బాబా ధ్యేయం

**భూమిపై మనం చూసిన దేవుడు ఆయనే**

**శతజయంతి ఉత్సవాల్లో సీఎం చంద్రబాబు**



**అందరినీ ప్రేమించు.. అందరినీ సేవించు**

**ఆయన భౌతికంగా లేకున్నా మనతోనే ఉన్నారు**

**ఆయన అందించిన సేవలు చిరస్థాయిగా నిలిచాయి**

**సత్యసాయి శత జయంత్యుత్సవాల్లో ప్రధాని**

పుట్టపర్తి,**నవంబర్ (జర్నలిస్ట్ వార్త):** సత్యసాయి జయంత్యుత్సవాల్లో పాల్గొనడం తన అదృష్టమని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. పుట్టపర్తిలో నిర్వహించిన సత్యసాయి శత జయంత్యుత్సవాలకు ఆయన హాజరై మాట్లాడారు. విశ్వప్రేమకు ప్రతిరూపంగా సత్యసాయి జీవించారు. భౌతికంగా బాబా లేకున్నా... ఆయన ప్రేమ మనతోనే ఉంది. సత్యసాయి బోధనల ప్రభావం దేశమంతా కనిపిస్తోంది.**మిగతాది 2లో...**

## నేడు బీహార్ సిఎంగా నితీశ్ ప్రమాణం

**పదోసారి ప్రమాణం చేయబోతున్న నితీశ్**

**ఎన్‌డిఏ నేతగా ఏకగ్రీవంగా ఎంపిక..**

**నేటి ప్రమాణోత్సవానికి మోడీ, అమిత్ షా తదితరుల హాజరు**



పాట్నా,**నవంబర్ (జర్నలిస్ట్ వార్త):**బిహార్‌లో నితీశ్ కుమార్ సారథ్యంలో ఎన్డీయే కొత్త ప్రభుత్వం గురువారం కొలువు తీరనుంది. బిహార్ ప్రస్తుత అసెంబ్లీ గడువు ముగియనుండటంతో ముఖ్యమంత్రి పదవికి నితీశ్ కుమార్ బుధవారం సాయంత్రం రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్‌ను సమర్పించారు. ఎన్డీయే సభ్యుల మద్దతు లేఖను గవర్నర్‌కు అందజేశారు. ప్రభుత్వ ఏర్పాటుకు తమను ఆహ్వానించాలని గవర్నర్‌ను కోరారు.**మిగతాది 2లో...**

## ఐ బొమ్మ రవికి పోలీస్ కస్టడీ

**ఐదురోజుల కస్టడీకి కోర్టు అనుమతి**




హైదరాబాద్,**నవంబర్ (జర్నలిస్ట్ వార్త):**
పైరసీ సైట్ 'ఐబొమ్మ' నిర్వాహకుడు ఇమంది రవి అరెస్టైన తరవాత పోలీసులు కస్టడీ కోరారు. ఈ కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ప్రధాన నిందితుడు రవి కస్టడీకి అనుమతిస్తూ హైదరాబాద్ నాంపల్లి కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఐదు రోజుల కస్టడీకి అనుమతిస్తూ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. రేపటి నుంచి ఐబొమ్మ రవిని కస్టడీలోకి తీసుకుని పోలీసులు ప్రశ్నించనున్నారు.**మిగతాది 2లో...**

## దొంగ ఓట్లతో గెలుపు



**జూబ్లీహిల్స్‌లో ఎలా గెలిచారో రేవంత్‌కు తెలియదా**

**బీఆర్‌ఎస్‌కు భయపడి అజారుద్దీన్‌కు మంత్రి పదవి**

**జూబ్లీహిల్స్ నాయకులతో వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్**

హైదరాబాద్,**నవంబర్ (జర్నలిస్ట్ వార్త):**
జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఎలా గెలిచిందో రేవంత్‌రెడ్డి అంతరాత్మకు తెలుసునని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు అన్నారు. కర్నాటక నుంచి మనుషులను తీసుకువచ్చి దొంగ ఓట్లు వేయించారన్నారు. షేక్‌పేట, ఎర్రగడ్డలో రిగ్గింగ్‌కు పాల్పడ్డారన్నారు. రాయించి, వేయించుకున్న ఓట్లతో జూబ్లీహిల్స్‌లో గెలిచారన్నారు**మిగతాది 2లో...**

## సింగరేణి భవన్ వద్ద కవిత ఆందోళన

**అదుపులోకి తీసుకున్న పోలీసులు**

**హైదరాబాద్,నవంబర్ (జర్నలిస్ట్ వార్త):**
నాంపల్లిలోని సింగరేణి భవన్ వద్ద ఆందోళనకు దిగిన తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవితను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. **మిగతాది 2లో...**



## పాలనలో ఇందిరాగాంధీ రోల్ మోడల్

**ఆమె స్ఫూర్తితో ముందుకు సాగుతున్నాం**

**ఇందిరకు ఘనంగా నివాళి అర్పించిన సిఎం**

**జయంతి వేడుకల సందర్భంగా మహిళలకు చీరల పంపిణీ**

హైదరాబాద్,**నవంబర్ (జర్నలిస్ట్ వార్త):**పరిపాలనలో ఇందిరా గాంధీ ఒక రోల్ మోడల్ అని సిఎం రేవంత్ రెడ్డి కొనియాడారు. బలహీన వర్గాలకు ఇందిరమ్మ పాలన సువర్ణ అధ్యాయమని సీఎం రేవంత్ చెప్పారు. భూ సంస్కరణలతో పేదలకు భూ పంపిణీ చేశారని గుర్తుచేశారు. పాకిస్తాన్‌ను విడగొట్టి బంగ్లాదేశ్‌ను ఏర్పాటు చేశారని, ప్రపంచ దేశాల బెదిరింపులకు ఇందిరమ్మ భయపడలేదని సీఎం రేవంత్ తెలిపారు.**మిగతాది 2లో...**



## మళ్లీ దద్దరిల్లిన మారేడుమిల్లి

**ఏపీ అటవీ ప్రాంతంలో ఎన్‌కౌంటర్**

**ఏడుగురు మావోయిస్టులు మృతి**

**వీరిలో ముగ్గురు మహిళలు**

**: ఏపీ ఇంటెలిజెన్స్ ఏడీజీ మహేశ్ చంద్ర లడ్హా వెల్లడి**



అమరావతి **నవంబర్ (జర్నలిస్ట్ వార్త):**
ఏపీలోని అల్లూరి సీతారామ రాజు జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతం మళ్లీ కాల్పుల మోతతో దద్దరిల్లింది. బుధవారం తెల్లవారుజామున జరిగిన ఎదురుకాల్పుల్లో ఏడుగురు మావోయిస్టులు మృతి చెందారు. వీరిలో ముగ్గురు మహిళలు ఉన్నారు. ఈ ఎన్‌కౌంటర్‌ను ఏపీ ఇంటెలిజెన్స్ అదనపు డీజీ మహేశ్ చంద్ర లడ్హా ధ్రువీకరించారు. మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో మావోయిస్టు అగ్రనేత మడ్వి హిడ్మాతో పాటు మరో ఐదుగురి ఎన్‌కౌంటర్ జరిగిన తర్వాతి రోజే ఈ ఘటన చోటు చేసుకోవడం గమనార్హం.**మిగతాది 2లో...**

# పంచాయతీ కసరత్తు షురూ

**ఓటర్ల సవరణ షెడ్యూల్ విడుదల**

**ఏర్పాట్లు మొదలు పెట్టిన రాష్ట్ర ఎన్నికల సంఘం**

**23న తుది ఓటర్ల జాబితా ఖరారు**

**డిసెంబర్ రెండో వారంలో నోటిఫికేషన్**

**బీసీ రిజర్వేషన్లపై పార్టీల మల్లగుల్లాలు**

**పార్టీల పరంగా రిజర్వేషన్లను వ్యతిరేకిస్తున్న బీసీ సంఘాలు**

**హైదరాబాద్,నవంబర్ (జర్నలిస్ట్ వార్త):**రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల కసరత్తు షురూ అయ్యింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) ఏర్పాట్లను ముమ్మరం చేసింది. డిసెంబర్ రెండో వారంలో ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశాలు ఉన్నాయి. దానికంటే ముందు ఓటర్ల సవరణ ప్రక్రియ షెడ్యూల్‌ను ఎస్ఈసీ ప్రకటించింది. దీనికి ఈనెల ..23వ**మిగతాది 2లో...**




## నేడు హైదరాబాద్‌లో సీబీఐ కోర్టుకు జగన్

**వ్యక్తిగతంగా హాజరుకావాలని ఆదేశించిన కోర్టు**

**జగన్ వ్యక్తిగత హాజరు మినహాయింపును వ్యతిరేకించిన సీబీఐ**

**ఆరేళ్లుగా జగన్ కోర్టుకు రావడం లేదని తెలిపిన దర్యాప్తు సంస్థ**




**హైదరాబాద్,నవంబర్ (జర్నలిస్ట్ వార్త):**
వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సుదీర్ఘ కాలం తర్వాత అక్రమాస్తుల కేసులోనేడు (గురువారం) హైదరాబాద్‌లోని సీబీఐ ప్రత్యేక కోర్టు ఎదుట వ్యక్తిగతంగా హాజరుకానున్నారు**మిగతాది 2లో...**

# ప్రపంచానికి ఆదర్శం

(మొదటి పేజీ తరువాయి)
కోట్ల మంది ఆయన భక్తులు మానవ సేవ చేస్తున్నారు. సత్యసాయి ప్రేమ సూత్రాలు ఎందరినో ఆలోచింపజేశాయన్నారు. బాబా బోధనలు లక్షల మందికి మార్గం చూపాయి. 'అందరినీ ప్రేమించు.. అందరినీ సేవించు'.. ఇదే ఆయన నినాదం. చాలా మంది జీవితాలను సత్యసాయి సమూలంగా మార్చేశారు. లక్షల మందిని సేవామార్గంలో నడిపించారు. ప్రజల కోసం ఎన్నో కార్యక్రమాలు చేపట్టారు. తాగునీరు, వైద్యం, విద్య వంటి రంగాల్లో విశిష్ట సేవలు అందించారు. పుట్టపర్తి పవిత్ర భూమిలో ఏదో మహత్తు ఉంది. సత్యసాయి సంస్థలన్నీ ఇలాగే ప్రేమను పంచుతూ వర్థిల్లాలని మోదీ అన్నారు. అంతకు ముందు సత్యసాయి జీవితం, బోధనలు, సేవల స్మారకార్థంగా రూపొందించిన రూ.100 నాణెం, 4 తపాలా బిళ్లలను ప్రధాని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్, క్రికెట్ దిగ్గజం సచిన్ తెందూల్కర్,నటి ఐశ్వర్యారాయ్ తదితరులు పాల్గొన్నారు. పుట్టపర్తికి రావడం ఎంతో సంతోషంగా ఉందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. సత్యసాయి జయంతి వేడుకల్లో పాల్గొనడం తన అదృష్టమని పేర్కొన్నారు. సత్యసాయి బాబా బోధనలు ఎంతోమందికి మార్గం చూపాయని కొనియాడారు.ప్రేమ, శాంతితో కూడిన వసుధైక కుటుంబ భావన సత్యసాయిదని తెలిపారు. విశ్వశాంతి, విశ్వసేవను బాబా మనకు చాటి చెప్పారని అన్నారు. మానవ జీవితంలో సేవ చాలా ముఖ్యమని సత్యసాయి చెప్పారని గుర్తుచేశారు. అందరినీ ప్రేమించాలి.. అందరికీ సేవ చేయాలి.. ఇదే బాబా నినాదమని వివరించారు. గుజరాత్ భూకంపం వచ్చినప్పుడు బాబా సేవాదళ్ సేవలందించిందని గుర్తుచేశారు. పేదలకు ఎప్పుడు ఆపద వచ్చినా.. బాబా సేవాదళ్ ఆదుకుంటుందని ప్రశంసించారు. తాగునీరు, వైద్యం, విద్య వంటి రంగాల్లో విశిష్ట సేవలందించారనిపేర్కొన్నారు.

-------------------

## సర్వమానవ సంక్షేమమే బాబా ధ్యేయం

### శతజయంతి ఉత్సవాల్లో సీఎం చంద్రబాబు

పుట్టపర్తి,నవంబర్19(ఆర్ఎన్ఎ): విశ్వశాంతి, సర్వమానవ సంక్షేమమే సత్యసాయి బాబా మార్గమని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. భూమిపై మనకు తెలిసిన.. మనం చూసిన దైవస్వరూపం

సత్యసాయిబాబా అని కొనియాడారు. పుట్టపర్తిలో నిర్వహించిన సత్యసాయి శత జయంత్యుత్సవాల్లో చంద్రబాబు మాట్లాడారు. ప్రధాని మోదీ, డిప్యూటీ సీఎం పవన్, పలువురుమంత్రులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మానవసేవే మాధవసేవ అని సత్యసాయి నమ్మి ఆచరించారు. ప్రపంచమంతా ప్రేమను పంచారు. విదేశాలకు వెళ్తే చాలా మంది ఆయన గురించి చెప్పేవారు. 1600 గ్రామాల్లో 30 లక్షల మందికి తాగునీరు అందించారు. 102 విద్యాలయాలు నెలకొల్పారు. ఎన్నో వైద్యాలయాలు స్థాపించారు. 140 దేశాల్లో 200 కేంద్రాల్లో సత్యసాయి ట్రస్ట్ సేవలందిస్తోంది. ట్రస్ట్‌కు 7లక్షల మందికి పైగా వాలంటీర్లు ఉన్నారు. ప్రభుత్వాల కంటే వేగంగా సత్యసాయి స్పందించేవారు. ఆయన ప్రేమ సిద్ధాంతాన్ని మనమంతా అర్థం చేసుకోవాలి. సత్యసాయి చూపిన మార్గంలో ముందుకెళ్లాలని చంద్రబాబు అన్నారు. సత్యసాయి సిద్ధాంతాన్ని అందరూ అర్థం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఆయన సేవా సిద్ధాంతాలను విశేషంగా అభినందించారు. ప్రపంచం చూసిన ప్రత్యక్ష దైవం, ప్రేమ, సేవలకు ప్రతిరూపం శ్రీ సత్యసాయి బాబా. సత్యసాయి బాబా జయంతిని రాష్ట్ర పండుగగా జరుపుకుంటామని ఆయన స్పష్టం చేశారు. సత్యసాయి బాబా వ్యక్తిత్వంలో ఒక అసాధారణ ఆకర్షణ ఉందని చంద్రబాబు పేర్కొన్నారు. నాస్తికులని కూడా ఆధ్యాత్మికత వైపు మళ్లించే శక్తి ఆయనలో ఉందని అన్నారు చంద్రబాబు.. 'మానవ సేవే మాధవ సేవ' అనే బాబా సిద్ధాంతమే ప్రపంచానికి నిజమైన సందేశమని సీఎం అన్నారు. సత్యసాయి బాబా ఒకటో తరగతి నుండి పీహెచ్‌డీ వరకు పూర్తిగా ఉచితంగా





విద్య అందించి లక్షల్లో విద్యార్థుల భవిష్యత్తును మలిచారని చంద్రబాబు గుర్తుచేశారు. కేవలం ఆధ్యాత్మికతకే పరిమితం కాకుండా, ఆస్పత్రులు, నీటి ప్రాజెక్టులు, సేవా సంస్థలు ద్వారా వేలాది మందికి ప్రాణాధారం అయ్యారని తెలిపారు. భక్తులపై అపారమైన ప్రేమ చూపిన సత్యసాయి బాబా, వారిని ఎల్లప్పుడూ 'బంగారూ' అని పిలిచేవారని సీఎం గుర్తుచేశారు. అది ఆయన హృదయపూర్వక ప్రేమకు ప్రతీక అని వ్యాఖ్యానించారు. 'సత్యసాయి సిద్ధాంతం అందరూ అర్థం చేసుకోవాలి' సూచించారు.. ప్రపంచమంతా ప్రేమను పంచారు.. విదేశాలకు వెళ్తే చాలా మంది ఆయన గురించి చెబుతారని తెలిపారు.. 1600 గ్రామాల్లో 30 లక్షల మందికి తాగునీరు అందించారిన గుర్తించారు.. ఏకంగా 102 విద్యాలయాలు నెలకొల్పారు.. ఎన్నో వైద్యాలయాలు స్థాపించారని.. ఏకంగా 140 దేశాల్లో 200 కేంద్రాల్లో సత్యసాయి ట్రస్ట్ సేవలందిస్తోందని తెలిపారు సీఎం నారా చంద్రబాబు నాయుడు..

# పాలనలో ఇందిరాగాంధీ రోల్‌మోడల్

(మొదటి పేజీ తరువాయి)
మాజీ ప్రధాని, దివంగత ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా.. నెక్లెస్ రోడ్డులోని ఇందిరా గాంధీ విగ్రహానికి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇందిరా గాంధీ స్ఫూర్తితో రాష్ట్రంలో ప్రజా పాలన చేస్తున్నామని, మహిళలకు స్థానిక సంస్థల్లో ప్రాతినిథ్యం ఇస్తున్నామని సీఎం చెప్పారు. వెయ్యి ఆర్టీసీ బస్సులకు మహిళలను ఓనర్లను చేశామని గుర్తుచేశారు. ఇందిరాగాంధీ పాలన దేశానికి దిక్సూచి అని సీఎం రేవంత్ కొనియాడారు. వైఎస్ఆర్ హయంలో 25 లక్షల ఇందిరమ్మ ఇండ్లు కట్టించారని, డబుల్ బెడ్రూం ఇండ్లు ఇస్తామని చెప్పి బీఆర్ఎస్ మోసం చేసిందని సీఎం విమర్శించారు. రాష్ట్రంలో 4 లక్షల ఇందిరమ్మ ఇండ్లు కట్టిస్తున్నామని, ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో మహిళలను భాగస్వామ్యులను చేస్తున్నామని సీఎం రేవంత్ చెప్పారు. 65 లక్షల చీరలను గ్రామీణ ప్రాంతాల ప్రజలకు పంపిణీ చేస్తామని, డిసెంబర్ 9 వరకూ ఇంటింటికీ చీరల పంపిణీ కొనసాగిస్తామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కోటి మంది మహిళలకు కోటి చీరలు పంపిణీ చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. మార్చి ఫస్ట్ నుంచి 8 వరకూ రెండో విడతలో చీరల పంపిణీ ఉంటుందని, రెండో విడతలో 35 లక్షల చీరలను పట్టణాల్లో పంపిణీ చేస్తామని సీఎం రేవంత్ తెలిపారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ చీరల పంపిణీని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. పలువురు మహిళలకు చీరలను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, వాకిటి శ్రీహరి, కొండా సురేఖ, సీతక్క పాల్గొన్నారు. రాష్ట్రంలో కోటి మంది మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేయనున్నారు. నేటి నుంచి తెలంగాణ తల్లి అవతరణ దినోత్సవం డిసెంబరు 9 నాటికి గ్రామీణ ప్రాంతాల్లో చీరల పంపిణీ ప్రక్రియను పూర్తి చేయనున్నారు. రెండో దశలో మార్చి 1 నుంచి అంతర్జాతీయ మహిళా దినోత్సవం మార్చి 8 వరకు పట్టణ ప్రాంతాల్లో అందజేయనున్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా చీరల పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. పంపిణీని మండల కేంద్రాల్లో ఘనంగా నిర్వహించాలని చెప్పారు. ఇందుకు నియోజకవర్గానికో ప్రత్యేక అధికారిని నియమించనున్నట్లు తెలిపారు. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేలా ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. మహిళలకు చీరలు పంపిణీ చేసి.. వారి వివరాలు సేకరించాలని ఆదేశించారు. దీని ద్వారా భవిష్యత్తులో సంక్షేమ పథకాలు వర్తిస్తాయని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో 65 లక్షల మంది మహిళలకు, మున్సిపాలిటీల్లో 35 లక్షల మంది మహిళలకు చీరల పంపిణీ చేస్తామని వివరించారు.ఇందిరమ్మ స్ఫూర్తితో మా ప్రభుత్వం ముందుకు వెళ్తోంది. మహిళలు పెట్రోల్ బంకులు నిర్వహించుకునేలా ప్రోత్సహించాం. ఆర్టీసీలో వెయ్యి బస్సులకు మహిళలను యజమానులను చేశాం. మహిళల సంక్షేమంతో పాటు ఆర్థిక ఉన్నతి కలిగించే కార్యక్రమాలు
చేపట్టాం. ఆడబిడ్డల పేరుతోనే ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తున్నాం. రాజకీయాల్లోనూ మహిళలకు తగిన ప్రాధాన్యత కల్పించాం. కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేయాలని లక్ష్యంగా పెట్టుకుని ప్రభుత్వం పనిచేస్తోంది. తెలంగాణ ఆడబిడ్డలకు ప్రభుత్వం తరఫున సారె పెట్టి గౌరవించాలని భావించాం. అందుకే కోటి మంది ఆడబిడ్డలకు కోటి చీరలు పంపిణీ చేయాలని నిర్ణయించాం. మహిళా మంత్రులు, మహిళా ఎమ్మెల్యేలు, మహిళా అధికారులు ఇందిరమ్మ చీర కట్టుకోవాలి. మీరే బ్రాండ్ అంబాసిడర్‌గా మారి ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని చాటాలని సీఎం అన్నారు.

# జూబ్లీహిల్స్‌లో దొంగ ఓట్లతో గెలుపు

(మొదటి పేజీ తరువాయి)
. తెలంగాణ భవన్‌లో బుధవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని ముఖ్య నాయకులు, ఇన్‌చార్జీలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మాజీ మంత్రులు హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యేలు, మాగంటి సునీత హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతం, కార్యకర్తల కోసం చేపట్టాల్సిన కార్యక్రమాలకు సంబంధించి చర్చించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. మాగంటి సునీతకు బీఆర్ఎస్ అండగా నిలిచిందన్నారు. సునీతాగోపీనాథ్ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కుటుంబ సభ్యుల్లా పని చేశారన్నారు. వచ్చే కార్పొరేటర్ ఎన్నికల్లో కార్యకర్తల గెలుపు కోసం కాలికి బలపం కట్టుకొని తిరుగుతామన్నారు. కాంగ్రెస్, బీజేపీ ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడ్డాయని ఆరోపించారు.విషాదంలో ఉన్న హరీశ్‌రావు అంకితభావంతో పని చేశారని, స్థానిక ఎన్నికలే లక్ష్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు. జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో గెలుపు కోసం అందరి కృషి చేద్దామన్నారు. ఎవరికీ ఎలాంటి ఇబ్బంది ఉన్నా పూర్తి అండగా ఉంటామన్నారు. ఎవరికి సమస్య వచ్చినా తెలంగాణ భవన్‌కు రావొచ్చునన్నారు. డిసెంబర్‌లోగా సర్పంచ్, జిల్లా పరిషత్ ఎన్నికలు పూర్తయ్యే అవకాశం ఉందని, స్థానిక ఎన్నికలు పూర్తి కాగానే బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు చేపడుతామన్నారు. బూత్‌లవారీగా పటిష్టంగా పార్టీ కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. జూబ్లీహిల్స్‌లో 407 బూతుల్లో ఒక్కో




బూత్‌కు 10 మంది చొప్పున పార్టీని పటిష్టం చేసుకోవాలన్నారు. ఎక్కడ పోగొట్టుకున్నామో అక్కడే వెతుక్కోవాలని.. ప్రజా సమస్యలపై పోరాటం ఇప్పటి నుంచే మొదలుపెట్టాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. జీహెచ్‌ఎంసీ ఎన్నికలకు ఇప్పటి నుంచే గ్రౌండ్ వర్క్ చేయాలన్నారు. హరీశ్‌రావు మాట్లాడుతూ ఉప ఎన్నికల్లో అధికార పార్టీకి అనుకూలంగా ఉంటుందన్నారు. జూబ్లీహిల్స్‌లో సాంకేతికంగా మాత్రమే కాంగ్రెస్ గెలుపని.. జూబ్లీహిల్స్‌లో నైతిక గెలుపు సునీత, బీఆర్ఎస్ పార్టీదేనన్నారు. బీఆర్ఎస్ నేతలు అధైర్యపడాల్సిన అవసరం లేదని, పార్లమెంట్ ఎన్నికల్లో కేవలం 18వేల ఓట్లు మాత్రమే వచ్చాయని.. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో 75వేల ఓట్లు సంపాదించామని తెలిపారు. మైనారిటీల మద్దతు కోల్పోతున్నామని కాంగ్రెస్ గుర్తించిందని.. బీఆర్ఎస్‌కు భయపడి అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇచ్చారని, బీఆర్ఎస్‌ను చూసి కాంగ్రెస్ పార్టీ గడగడలాడిపోయిందన్నారు. కాంగ్రెస్, బీజేపీ, మజ్లిస్ ఒక వైపు, బీఆర్ఎస్ పార్టీ ఒంటరి పోరాటం చేసిందన్న హరీశ్.. అధికార దుర్వినియోగంతో గెలిచిన విషయం రేవంత్‌రెడ్డికి తెలుసునన్నారు. దుబ్బాక, హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో ఓడిపోయినా తర్వాత ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలిచిందన్నారు. త్వరలోనే మళ్లీ కేసీఆర్ అధికారంలోకి వస్తారని, తమను ఇబ్బంది పెట్టిన ఎవరినీ వదిలిపెట్టమని హెచ్చరించారు. కేటీఆర్, తలసాని సహా తామంతా కలిసి కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు. జీహెచ్‌ఎంసీ, ఇతర ఎన్నికలకు సిద్ధంగా ఉందామని హరీశ్‌రావు పిలుపునిచ్చారు.

# నేడు బీహార్ సిఎంగా నితీశ్ ప్రమాణం

(మొదటి పేజీ తరువాయి)
ఇందుకు గవర్నర్ సానుకూలంగా స్పందించారు. నితీశ్ రాజీనామాను వెంటనే ఆమోదించారు. నితీశ్ వెంట గవర్నర్‌ను కలిసి వారిలో ఎల్‌జేపీఆర్‌వీ చీఫ్ చిరాగ్ పాశ్వాన్, ఆర్ఎల్ఎం చీఫ్ ఉపేంద్ర కుష్వాహ తదితరులు ఉన్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటు దిశగా బుధవారం ఉదయం నుంచి పాట్నాలో వేగంగా పరిణామాలు చోటుచేసుకున్నాయి. జేడీయూ ఎమ్మెల్యేలు సమావేశమై పార్టీ శాసనసభా పక్ష నేతగా నితీశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బీజేపీ లెసిస్లేచర్ పార్టీ నేతలు సైతం సమావేశమై పార్టీ నేతలు సామ్రాట్ చౌదరి, విజయ్ సిన్హా ఉప ముఖ్యమంత్రులుగా తిరిగి కొనసాగించాలని నిర్ణయించారు. అనంతరం ఎన్డీయే సమావేశం జరిగింది. ఈ సమావేశంలో దిలీప్ జైశ్వాల్, సామ్రాట్ చౌదరి, చిరాగ్ పాశ్వాన్, కేశవ్ ప్రసాద్ మౌర్య, విజయ్ కుమార్ సిన్హా, రాజు తివారి సహా ఎన్డీయేకు చెందిన 202 మంది ఎమ్మెల్యేలు హాజరయ్యారు. ఎన్డీయే లెజిస్లేచర్ పార్టీ నేతగా నితీశ్ కుమార్ పేరును సామ్రాట్ చౌదరి ప్రతిపాదించగా, ఎమ్మెల్యేలంతా బలపరిచారు. దీంతో నితీశ్ 10వ సారి ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టేందుకు మార్గం సుగమమైంది. ఈ సమావేశానంతరం నితీశ్ సారథ్యంలోని పలువురు నేతలు గవర్నర్‌ను కలుసుకున్నారు. మరోవైపు, నితీశ్ ప్రమాణస్వీకార కార్యక్రమానికి భారీ ఎత్తున
ఏర్పాట్లు జరుగుతున్నాయి. పాట్నాలోని గాంధీ మైదానంలో 20వ తేదీ మధ్యాహ్నం 11.30 గంటలకు ప్రమాణస్వీకారం ఉంటుంది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, పలువురు కేంద్ర మంత్రులు, ఎన్డీయే పాలిత ప్రాంతాల ముఖ్యమంత్రులు ఈ ప్రమాణస్వీకారోత్సవానికి హాజరవుతున్నారు.

# ఐ బొమ్మ రవికి పోలీస్ కస్టడీ

(మొదటి పేజీ తరువాయి)
పైరసీ మాఫియాకు సంబంధించిన వివరాలు రాబట్టే పనిలో పోలీసులు ఉన్నారు.వారం రోజుల పాటు ఇమంది రవిని కస్టడీకి ఇవ్వాలని నాంపల్లి కోర్టులో సైబర్ క్రైమ్ పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. ఇరు పక్షాల వాదనలు విన్న జడ్జి.. రవిని ఐదు రోజుల పాటు పోలీసు కస్టడీకి అనుమతించారు. కస్టడీ విచారణలో మరిన్ని కీలక అంశాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే ఈ కేసుపై ఈడీ దృష్టి సారించింది. తెలుగు రాష్టాల్లో సంచలనం సృష్టించిన పైరసీ మూవీ రాకెట్ ఐబొమ్మ కీలక సూత్రధారి రవిని సైబర్ క్రైమ్ పోలీసులు గత శనివారం కూకట్‌పల్లిలో అరెస్టు చేశారు. ఓటీటీ వేదికల్లోని కంటెంట్ సహా కొత్తగా రిలీజ్ అయిన సినిమాలు పైరసీ చేస్తూ సినీ పరిశ్రమకు తీవ్ర నష్టం కలిగించాడు. గత ఏడేళ్లుగా ఐ బొమ్మ, బప్పం, ఐవిన్, ఐరాధ టీవీ పేర్లతో వెబ్‌సైట్‌లు నిర్వహించాడు.

# మళ్లీ దద్దరిల్లిన మారేడుమిల్లి

(మొదటి పేజీ తరువాయి)
మహేశ్ చంద్ర లడ్డా విలేకరుల సమావేశంలో ఎన్‌కౌంటర్ వివరాలను వెల్లడించారు. నిఘా వర్గాల నుంచి అందిన సమాచారం మేరకు భద్రతా బలగాలు ఈ ఆపరేషన్‌ను చేపట్టాయి. మంగళవారం జరిపిన ఆపరేషన్‌కు కొనసాగింపుగా తాజా ఎన్‌కౌంటర్ జరిగింది. ఇప్పటి వరకు ఏడుగురు మావోయిస్టులు ప్రాణాలు కోల్పోయారు. ఇందులో ముగ్గురు మహిళా మావోయిస్టులు ఉన్నారు. మృతుల్లో శ్రీకాకుళానికి చెందిన మేటూరి జోగా రావు ఎలియాస్ 'టెక్' శంకర్‌తో పాటు జ్యోతి ఎలియాస్ సరిత, సురేశ్ ఎలియాస్ రమేశ్, లోకేశ్ ఎలియాస్ గణేశ్, సైను ఎలియాస్ వాసు, అనిత, షమ్మీ లు ఉన్నారు.శంకర్.. ఏఓబీ ఏరియా కమిటీ మెంబర్‌గా ఉన్నారు. టెక్నికల్ ఆపరేషన్, ఆయుధాల తయారీ, కమ్యూనికేషన్‌లో ఈయనకు మంచి పట్టున్నది. కాగా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో భద్రతా బలగాల కూంబింగ్ కొనసాగుతోంది. మృతదేహాలను రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా ఎన్టీఆర్, కృష్ణా, కాకినాడ, కోనసీమ, ఏలూరు జిల్లాల నుంచి ఇప్పటికే 50 మంది మావోయిస్టులను అరెస్ట్ చేసినట్టు ఆయన చెప్పారు. ఇంత పెద్ద మొత్తంలో మావోయిస్టులు అరెస్ట్ కావటం ఇదే తొలిసారి అని వివరించారు. వీరిలో స్పెషల్ జోనల్ కమిటీ సభ్యులు ముగ్గురు, ప్లాటూన్ సభ్యులు 23 మంది, డివిజినల్ కమిటీ సభ్యులు ఐదుగురితో పాటు ఏరియా కమిటీ సభ్యులు 19 మంది ఉన్నారని వివరించారు. భద్రతా దళాలు 45 ఆయుధాలు, 272 రౌండ్ల బుల్లెట్లు, రెండు మ్యాగజైన్లు, 750 గ్రాముల వైరు, ఇతర మెటీరియల్‌ను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. పోలీసులు.. మావోయిస్టుల కదలికలను ఛత్తీస్‌గఢ్ నుంచి గమనిస్తున్నారనీ, వారి కార్యకలపాల గురించి తెలుసుకున్న తర్వాతే తాజా ఆపరేషన్‌ను చేపట్టినట్టు వివరించారు. ఇక మంగళవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో తప్పించుకున్న మావోయిస్టుల కూడా పట్టుకునేందుకు బృందాలు రంగంలోకి దిగాయని చెప్పారు.

# సింగరేణి భవన్ వద్ద కవిత ఆందోళన

(మొదటి పేజీ తరువాయి)
సింగరేణిలో డిపెండెంట్ ఉద్యోగాల్ని పునరుద్ధరించాలని కోరుతూ తెలంగాణ జాగృతి, హెచ్ఎంఎస్ ఆధ్వర్యంలో సింగరేణి భవన్ ముట్టడికి యత్నించారు. సింగరేణి సమస్యలను పరిష్కరించలేని అసమర్థ ప్రభుత్వమని దుయ్యబట్టారు. కార్మికుల కోసం మెడికల్ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈక్రమంలో.. కవితతో పాటు హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్, అధ్యక్షుడు తిప్పారపు సారయ్య సహా పలువురు నాయకులను నాంపల్లి పోలీసులు అదుపులోకి తీసుకుని ఠాణాకు తరలించారు. సింగరేణి భవన్‌ను కవిత ముట్టడిస్తుందన్న సమాచారంతో పోలీసుల భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా.. పోలీసుల కళ్లుగప్పి ఆమె ఆటోలో సింగరేణి భవన్‌కు చేరుకుని ముట్టడికి ప్రయత్నించారు.

# నేడు హైదరాబాద్‌లో సీబీఐ కోర్టుకు జగన్

.(మొదటి పేజీ తరువాయి)
ఈ కేసులో వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలంటూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను సీబీఐ తీవ్రంగా వ్యతిరేకించడంతో, కోర్టు ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది.
గత ఆరేళ్లుగా జగన్ కోర్టుకు ప్రత్యక్షంగా హాజరుకాలేదని, ప్రస్తుతం ఈ కేసుల్లోని డిశ్చార్జి పిటిషన్లపై రోజువారీ విచారణ జరుగుతున్నందున ఆయన భౌతికంగా హాజరుకావడం తప్పనిసరి అని సీబీఐ వాదించింది. ఈ వాదనతో ఏకీభవించిన న్యాయస్థానం, నవంబర్ 21లోగా వ్యక్తిగతంగా హాజరుకావాలని జగన్‌ను ఆదేశించింది. ఈ నేపథ్యంలో, గడువుకు ఒకరోజు ముందే ఆయన కోర్టుకు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. ఇటీవల జగన్ కోర్టు అనుమతితో ఐరోపా పర్యటనకు వెళ్లారు. పర్యటన ముగిసిన వెంటనే వ్యక్తిగతంగా హాజరుకావాలని అప్పుడే కోర్టు స్పష్టం చేసింది. అయితే, ఆయన హాజరుకాకుండా మినహాయింపు కోరారు. సీబీఐ అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఆయన పిటిషన్‌ను కోర్టు తిరస్కరించింది. కాగా, అక్రమాస్తుల కేసులో జగన్ 2013 సెప్టెంబరు నుంచి బెయిల్‌పై బయట ఉన్న విషయం తెలిసిందే.

# పంచాయతీ కసరత్తు షురూ

(మొదటి పేజీ తరువాయి)
తేదీని తుది గడువుగా నిర్ణయించింది. గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు మంత్రివర్గ సమావేశం ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. 2026 మార్చి 31వ తేదీ నాటికి ఎన్నికల నిర్వహించకుంటే గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం ప్రతిపాదించిన రూ.3వేల కోట్ల నిధులు మురిగిపోతాయి. అందువల్ల ఆ నిధుల కోసమైనా, ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావించింది.అదే సమయంలో ఎమ్‌పీటీసీ, జెడ్‌పీటీసీ, ఎంపీపీ ఎన్నికలను బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశంపై హైకోర్టు తీర్పు వచ్చాకే నిర్వహించాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. గ్రామపంచాయతీల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను పార్టీపరంగా అమలు చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. అయితే పంచాయతీ ఎన్నికలు పార్టీ గుర్తులపై జరగవనీ, వాటిని స్వతంత్రంగా నిర్వహిస్తారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్ అభ్యంతరం తెలిపారు. పార్టీ గుర్తులు లేనిచోట్ల పార్టీల పరంగా రిజర్వేషన్లు ఎలా సాధ్యమవుతాయనేది వారి వాదన. అయితే పార్టీ గుర్తులు లేకున్నా, సహజంగా ఆయా పార్టీలు బలపరిచిన అభ్యర్థులే పంచాయతీ ఎన్నికల్లో పోటీపడటం కనిపిస్తుంది. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్‌పార్టీ ఈ ప్రకటన చేసినట్టు తెలుస్తోంది. బీజేపీ కూడా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని ప్రకటించింది. బీఆర్ఎస్ ఇప్పటి వరకు దీనిపై స్పష్టత ఇవ్వలేదు. మంత్రివర్గ నిర్ణయాన్ని కొన్ని బీసీ సంఘాలు కూడా వ్యతిరేకిస్తున్నాయి.రిజర్వేషన్ల అంశం తేలాకే ఎన్నికలు నిర్వహించాలని కోరుతున్నాయి. అయితే మంత్రివర్గ నిర్ణయంతో రాష్ట్రంలోని 31 గ్రామీణ జిల్లాల్లోని 12,733 గ్రామపంచాయతీలకు ఎన్నికలు జరగనున్నాయి. అయితే తాజా మాజీ సర్పంచ్‌లకు రాష్ట్ర ప్రభుత్వం దాదాపు రూ.530 కోట్లకు పైగా బకాయిలు చెల్లించాల్సి ఉంది. దీనికోసం సర్పంచ్‌ల సంఘం జేఏసీ పలుమార్లు ప్రభుత్వానికి వినతిపత్రాలు సమర్పించి, ఆందోళనలు చేపట్టింది. అయితే ప్రభుత్వం మాత్రం ఇప్పుడు గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించి, కేంద్ర నిధులు వస్తే, వాటితో పాత బకాయిల చెల్లించాలని భావిస్తుంది.

## పినపాక జెడ్‌పిహెచ్ఎస్ విద్యార్థి
# షేక్ ఆసిఫ్‌కు జాతీయ గౌరవం



**పినపాక/నవంబర్ 19 (జర్నలిస్ట్ వార్త):** పినపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రతిష్టను దేశవ్యాప్తంగా నిలబెట్టిన విద్యార్థి షేక్ ఆసిఫ్‌కు జాతీయ స్థాయి విశిష్ట గౌరవం లభించింది. “టాటా నిర్మాణ దేశం” వ్యాసరచనా పోటీలో అతను రాసిన వ్యాసం దేశంలోనే ఉత్తమంగా ఎంపికై మన పాఠశాల పేరు మరింత ఎత్తుకు తీసుకెళ్లింది.గత విద్యాసంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన ఆసిఫ్ అద్భుత ప్రతిభను ప్రదర్శించాడు. టాటా సంస్థ ప్రతినిధుల ఆధ్వర్యంలో, ఉపాధ్యాయుల పర్యవేక్షణలో గత సెప్టెంబరు నెలలో ఈ పోటీ పినపాక పాఠశాలలో నిర్వహించారు. దేశవ్యాప్తంగా వేలమంది విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీలో ఆసిఫ్ ప్రత్యేక ప్రతిభతో జాతీయ స్థాయి విజేతగా నిలిచాడు.విజేతకు భారత రాష్ట్రపతి గారి చేతుల మీదుగా బంగారు పతకం అందజేయనున్నారు. ఇందుకు అవసరమైన రాజధాని ప్రయాణ ఖర్చులు, విమాన ప్రయాణం సహా అన్ని ఏర్పాట్లు టాటా సంస్థ భరిచనుంది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొండా నరసింహారావు, ఉపాధ్యాయులు ఆసిఫ్‌ను ఆశీర్వదిస్తూ మన పాఠశాల గౌరవాన్ని పెంచిన ఈ విద్యార్థి భవిష్యత్తు మరింత వెలుగులు నిండి ఉండాలి” అని ఆకాంక్షించారు.

## పెండింగ్ కరువు బత్యాలు వెంటనే విడుదల చేయాలి

### ఉపాధ్యాయులపై ప్రభుత్వం దృష్టిసారించాలి - టీఎస్‌యుటిఎఫ్




**హనుమకొండ బ్యూరో/ధర్మసాగర్, నవంబర్ 19 (జర్నలిస్ట్ వార్త):**
ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పెండింగులో పేరుకుపోయిన ఐదు విడతల కరువు బత్యాలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని టీఎస్‌యుటిఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షులు సిహెచ్. రవీందర్ రాజు డిమాండ్ చేశారు. ధర్మసాగర్ మండలంలోని పెద్దపెండ్యాల, తాటికాయల, ధర్మసాగర్ బాలికల ఉన్నత పాఠశాల, మలక్పల్లి మహాత్మ జ్యోతిరావు పూలే పాఠశాలల్లో బుధవారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా రవీందర్ రాజు మాట్లాడుతూ పిఆర్‌సి కమిటీ నివేదికను ఆలస్యానికి గురిచేయకుండా వెంటనే తెప్పించి అమలు చేయాలని, 2010 ముందు నియామకమైన ఉపాధ్యాయులను టెట్ నుంచి పూర్తిగా మినహాయించాలని అన్నారు. డైట్, బీఈడీ కళాశాలలో బోధన సిబ్బంది నియామకాలు చేపట్టడంతోపాటు, డిప్యూటీ డీఈవో, డీఈవో ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాల్సిన అవసరం ఉన్నదని గుర్తుచేశారు.జిల్లా ప్రధాన కార్యదర్శి పెండెం రాజు మాట్లాడుతూమోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు జీరో%-%వన్%-%జీరో తలంపు కింద వేతనాలు మంజూరు చేయాలని, గురుకుల పాఠశాలల పని వేళల్లో మార్పులు చేయాలని, కేజీబీవీ మహిళా సిబ్బందికి కనీస టైమ్%-%స్కేలు అమలు చేయాలని తెలిపారు.కార్యక్రమంలో ధర్మసాగర్ మండల బాధ్యులు సురేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## వర్ధన్నపేట లో ఇందిరా గాంధీ 108వ జయంతి వేడుకలు



**వర్ధన్నపేట/నవంబర్ 19 (జర్నలిస్ట్ వార్త):** వర్ధన్నపేట మండల కేంద్రంలో మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ 108వ జయంతిని కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. మండల అధ్యక్షుడు ఎద్దు సత్యం, టౌన్ ప్రసిడెంట్ మైస సురేష్ ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 1966లో దేశం ఆర్థిక సంక్షోభంలో ఉన్న సమయంలో బాధ్యతలు స్వీకరించి దేశాన్ని నిలబెట్టిన గొప్ప నాయకురాలు ఇందిరా గాంధీ అని ప్రశంసించారు. పేదరిక నిర్మూలన కోసం గరిభి హటావో, 20 సూత్రాల పథకం, బ్యాంకుల జాతీయీకరణ వంటి నిర్ణయాలు దేశ అభివృద్ధికి కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, సీనియర్ నాయకులు పోషాల వెంకన్న గౌడ్, మహిళా మండల అధ్యక్షురాలు మరుపట్ల అరుణ, యూత్ కాంగ్రెస్ నాయకులు కుల్ల యాకంతం, గుంతి కుమారస్వామి, గుజ్జ రవీందర్ రెడ్డి, ఎండి అన్వర్, మైదం బుచ్చి మల్లు, మనోహర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 21 న ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

### .మత్స్య పారిశ్రామిక సొసైటీ జిల్లా అధ్యక్షుడు నీల రాజు



**స్టేషన్ ఘన్ పూర్/ నవంబర్ 19 (జర్నలిస్ట్ వార్త) :**
ఈనెల 21న ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని, ముదిరాజ్ మహాసభ ఆవిర్భావదినోత్సవాన్ని మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో విజయవంతం చేయా లని మత్స్య పారిశ్రామిక సొసైటీ జిల్లా అధ్యక్షుడు నీల రాజు ముదిరాజ్ పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 21న జరగనున్న ప్రపం చ మత్స్యకారుల దినోత్సవంను మత్స్యకారులున్న ప్రతి గ్రామంలో ఘనంగా నిర్వహించి మత్స్యసంరక్షణ చట్టంకోసం పోరాడాల్సిందిగా మన ముదిరాజ్ మహా సభ రాష్ట్ర కమిటీ పిలుపు నివ్వడం జరిగిందన్నారు. ప్రపంచ మత్స్యకారులదినోత్సవం ఒకపోరాట దినంగా భావించి పెద్ద ఎత్తున నిర్వహించి, అన్ని గ్రామాల్లో ముదిరాజులు జెండా ఎగరవేసి,అందరూ ఐక్యమత్యం తో ముందుకు సాగాలని అన్నారు.

## ఘనంగా అయ్యప్ప స్వామి మహా పడిపూజ





**తల్లాడ/నవంబర్19(జర్నలిస్ట్ వార్త):**
పినపాక గ్రామం లో కన్నుల పండుగగా జరిగిన అయ్యప్ప స్వామి మహా పడిపూజ పంచామృతాలతో అయ్యప్ప స్వామి కి అభిషేకం భారీగా హాజరైన స్వాములు, అయ్యప్ప భక్తులుతల్లాడ మండలం పినపాక గ్రామం లో అయ్యప్ప స్వామి మహా పడి పూజ కార్యక్రమం తోకల. క్రిష్ణయ్య(క్రిష్ణ కాంత్ )ఉష రేణు గృహం నందు ఘనంగా జరిగింది. అర్చకులు మణికంఠ గురు స్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప మహా పడి పూజ, అయ్యప్ప కి పంచామృతాలతో అభిషేకం, 18 మెట్ల పై పడి వెలిగించడం చాలా చక్కగా జరిగింది.ఈ కార్యక్రమం కి తల్లాడ భజన భక్త బృందం ఈలప్రోలు వెంకట్ గురు స్వామి హాజరై అయ్యప్ప పాటలతో భజన తో ఆ పినపాక ప్రాంతమంతా మారుమోగింది.ఈ కార్యక్రమం లో గురు స్వాములు గుడి పూడి.నరసింహ రావు,సమెర్ల కోటేశ్వరరావు,కందుల. సతీష్ స్వామి, ఈలప్రోలు. వెంకట్ స్వామి,ధూపాటి నరేష్ రాజు స్వామి,వేమిశెట్టి. దిలీప్ స్వామి, మణికంఠ స్వామి, రాగం. నాగేశ్వరావు స్వామి, తదితరులు పాల్గొన్నారు.

## ఇరుముడి కార్యక్రమంలో పాల్గొన్న జక్కంపూడి



**తల్లాడ/నవంబర్19(జర్నలిస్ట్ వార్త):** తల్లాడ మండలం బిల్లుపాడు గ్రామపంచాయతీలో శ్రీ ఆంజనేయ స్వామి వారి ఆలయంలో శ్రీ హరిహర అయ్యప్ప స్వామి ఇరుముడి కార్యక్రమం బుధవారం నిర్వహించగా తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు జక్కంపూడి కిషోర్ సామినేని రామప్పరావు జక్కపొడి రమేష్ ఆర్.ఎం.పి రామకృష్ణ ఇరుముడి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజనరసరావు స్వామి గురు స్వామి ఆధ్వర్యంలో ఇరుముడి కార్యక్రమం రాకేష్ స్వామి, సాంబ, స్వామి నరసింహారావు స్వామిఎంతో ఉత్సాహంగా జరుపుకోవడం జరిగినది శబరిమలైకి బస్సు యాత్రతో బయలుదేరటానికి సిద్ధమైనారు స్వాములు

## ఘనంగా ఐనవోలు లో ఇందిరా గాంధీ జయంతి వేడుకలు



**ఐనవోలు/నవంబర్ 19 (జర్నలిస్ట్ వార్త):** భారతదేశ తొలి మహిళా ప్రధానమంత్రి, దూరదృష్టి కలిగిన శక్తిమంత నాయకురాలు ఇందిరా గాంధీ జయంతిని పురస్కరించుకుని ఈరోజు ఐనవోలు మండల కేంద్రంలోని నంది విగ్రహం సెంటర్ వద్ద వేడుకలు ఘనంగా నిర్వహించారు.వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆదేశాల మేరకు, ఐనవోలు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సమ్మెట మహేందర్ గౌడ్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆమె దేశాభివృద్ధికి చేసిన సేవలను ఈ సందర్భంగా నేతలు స్మరించుకున్నారు.ఈ కార్యక్రమంలో కాంటెస్ట్ జెడ్పిటిసి పోల్లపల్లి బుచ్చిరెడ్డి, కట్కూరి స్వామి, అధికార ప్రతినిధి కొత్తూరు సునీల్, మహిళా అధ్యక్షురాలు ఇల్లందుల ఎలీషా, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు యాకార సాంబయ్య, మైనార్టీ సెల్ అధ్యక్షుడు రహీం పాషా, ఇందిరమ్మ కమిటీ సభ్యులు వాకిటి సంపత్ రెడ్డి, కుమారస్వామి, ఈ బొల్లాపల్లి పరమేష్ గౌడ్, టెంపుల్ డైరెక్టర్ బరిగల ఆనందం, మాజీ సర్పంచ్ జన్ను కుమారస్వామి, పోలపల్లి సంపత్, పెండ్లి సంపత్, తిరుపతి రెడ్డి, వీరస్వామి, నరసయ్య, గడ్డం మురళి గౌడ్, బరిగల మహేందర్, యాకుబ్ పాషా తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డుకు ఇరువైపులా ప్రమాదకరంగా చెట్ల కొమ్మలు

### జెసిబి సహాయంతో తొలగించిన పోలీసులు



**ఎల్కతుర్తి, భీమదేవరపల్లి/ నవంబర్19 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలోని జీలుగుల, జగన్నాథపూర్ గ్రామాల మధ్య రోడ్డుకు ఇరువైపులా చెట్ల కొమ్మలు ప్రమాదకరంగా మారాయి. గమనించిన ఎల్కతుర్తి ఎస్ఐ ప్రవీణ్ కుమార్ స్పందించి జెసిబి సాయంతో చెట్ల కొమ్మలు తొలగించారు. రోడ్డు మలుపుల వద్ద వాహనదారులకు ఇబ్బందిగా మారిన చెట్ల పొదలను లేకుండా చేశారు. పోలీసులు స్పందన చూసిన స్థానికులు వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ సారంగపాణి, కానిస్టేబుల్ భాస్కర్ రెడ్డి, హెూంగార్డు శ్రీధర్ పాల్గొన్నారు.

## విద్యుత్ ఘాతం తో
# వరి పొలం దగ్ధం



**రాయపర్తి/నవంబర్ 19(జర్నలిస్ట్ వార్త):** మండల కేంద్రానికి చెందిన మహమ్మద్ రహీముద్దీన్ వ్యవసాయ పొలంలోని విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ఫీజు కొట్టివేయడంతో నిప్పులు చెలరేగి కోతకు వచ్చిన దశలో ఉన్న సుమారు అరెకరం పొలం కాలి బూడిదైంది. స్థానిక రైతులు గమనించి మంటలు ఆర్పి వేయడంతో పెను ప్రమాదం తప్పింది. బాధిత రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని రైతు లు కోరుతున్నారు.

## ఘనంగా ఇందిరా గాంధీ జయంతి వేడుకలు



**రాయపర్తి/నవంబర్ 19(జర్నలిస్ట్ వార్త):**మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ప్రధాని భారత తొలి మహిళ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ జయంతి వేడుకలను బుధవారం కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షులు మచ్చా రమేష్ ఇందిరా గాంధీ చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులతో కలిసి పూలమాలవేసి నివాళు లు అర్పించారు.ఈ కార్యక్రమంలో షేక్ రఫీక్,మండల ఉపాధ్యక్షులు భూక్య సమ్మయ్య నాయక్, మహిళ నాయకురాలు వనజారాణి,ఎండి ఫెరోజ్,రామా నాయక్, ఎండి గౌస్ ఖాన్, నరసింహమూర్తి,మైనార్టీ మండల అధ్యక్షులు అఫ్రోజ్ ఖాన్ చెవ్వ కాశినాదం, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు

## విద్యార్థులకు షూ,టై బెల్ట్ ల పంపిణీ



**రాయపర్తి/నవంబర్ 19(జర్నలిస్ట్ వార్త):** రాయపర్తి మండలంలోని కాట్రపల్లి గ్రామంలో మండల ప్రజా పరిషత్ పాఠశాల విద్యార్థులకు ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి పంపించిన షూస్, టై, బెల్ట్, టీ షర్ట్స్ లను బుధవారం మాజీ సర్పంచ్ బోనగిరి ఎల్లయ్య విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## భగవద్గీత పఠనంలో అసమాన ప్రతిభ

### బంగారు పతకం సాధించిన వేణునూతుల మౌనిక



**సత్తుపల్లి/ నవంబర్19 (జర్నలిస్ట్ వార్త):**
మండల పరిధిలోని బేతుపల్లి గ్రామానికి చెందిన వేణునూతుల మౌనిక భగవద్గీత పఠనం లో తన అసమాన ప్రతిభనుప్రదర్శించి బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది. వివరాలలోకి వెళితే బేతుపల్లి గ్రామానికి చెందిన అంకమ్మ తల్లి ఆలయ అర్చక స్వామి ధర్మపత్ని అయిన వేణునూతుల మౌనిక భగవద్గీత లోని 18 అధ్యాయాల లోని 700శ్లోకాలను,కంఠస్థం చేసింది. ఇటీవల ఆన్లైన్ లో నిర్వహించిన పోటీలో పాల్గొని బంగారు పతకం సాధించింది. ఈ బంగారు పతకాన్ని మౌనిక మైసూరు దత్త పీఠాధిపతి సచ్చిదానంద స్వామి చేతుల మీదుగా స్వీకరించనున్నట్లు ఆమె తెలియచేసారు. ఈ విజయాన్ని తన గురువు అయిన మాడుగుల రమ్యకు అంకితం చేస్తున్నట్లు తెలియచేసారు. ఈ సందర్భంగా బేతుపల్లి గ్రామస్థులు మౌనికకు అభినందనలు తెలిపారు.

# జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదకు మంత్రి అభినందనలు



**వరంగల్/నవంబర్19 (జర్నలిస్ట్ వార్త):**జల సంరక్షణ కేటగిరీ%-%2లో దేశస్థాయి మొదటి స్థానం సాధించిన విజయ సందర్భంలో వరంగల్ జిల్లా మరో ప్రతిష్ఠాత్మక గౌరవాన్ని అందుకుంది. ఢిల్లీలో నిర్వహించిన అవార్డు ప్రదాన కార్యక్రమంలో అవార్డుతో పాటు రూ. కోటి ప్రోత్సాహకాన్ని స్వీకరించిన అనంతరం, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద బుధవారం హైదరాబాద్‌లో ఉమ్మడి జిల్లా ఇంచార్జి మంత్రి, రాష్ట్ర రెవెన్యూ%-%హౌజింగ్%-%సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి కలెక్టర్‌ను హృదయపూర్వకంగా అభినందిస్తూవరంగల్ జిల్లాలో జల సంరక్షణ చర్యలు ఆదర్శంగా నిలిచాయన్నారు. ప్రజల భాగస్వామ్యంతో రూపుదిద్దుకున్న కార్యక్రమాలు రాష్ట్రానికి గౌరవం తెచ్చాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని వినూత్న ప్రాజెక్టులు తీసుకువస్తూ జల వనరుల పరిరక్షణలో జిల్లా మోడల్‌గా ముందంజలో నిలవాలని ఆకాంక్షించారు. డాక్టర్ సత్య శారద యొక్క సేవాభావం, కట్టుబాటు ప్రశంసనీయం అని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు.

# అధికారుల నిర్లక్ష్యంతో

## ఆస్పత్రి ప్రాంగణంలో డయాలసిస్ నీరు నిల్వ





**సత్తుపల్లి/నవంబర్ 19 (జర్నలిస్ట్ వార్త):** సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో నెలలుగా కొనసాగుతున్న డయాలసిస్ వృధా నీటి సమస్య మరింత తీవ్రరూపం దాల్చింది. డయాలసిస్ కేంద్రంలో ఉపయోగించే మిషనరీ నుంచి 24 గంటలు వెలువడే ఇంజక్షన్, ఫ్లూయిడ్, లిక్విడ్ కలిసిన వృధా నీరు ఆసుపత్రి ఆవరణలోనే చేరిపోతూ చిన్నచిన్న చెరువుల్లా నిల్వ అవుతోంది. ఒక్కో మిషన్ నుంచి రోజుకు 50%-%60 లీటర్ల నీరు వెలువడటంతో ఐదు మిషన్లు కలిపి రోజూ భారీగా నీరు బయటపడుతోంది. రోగులు పెరగడంతో రోజుకు 20%-%25 మంది డయాలసిస్ చేయించుకుంటుండటంతో నీటి పరిమాణం రోజు రోజుకు పెరుగుతోంది. ప్రత్యేకమైన వృధా నీటి ట్యాంక్‌ను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉన్నప్పటికీ అధికారులు ఈ వ్యవహారాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో మాత-శిశు సంరక్షణ కేంద్రం వద్దకు ఈ నీరు చేరి ఆ ప్రాంతమంతా దుర్వాసనతో పాటు పాకుడు పట్టింది. నీరు నిల్వ ఉండటంతో పెద్ద సంఖ్యలో దోమలు, ఈగలు ప్రబలిపోవడంతో గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం వేడిమి పెరగకముందే చిన్నారులను బయటకు తీసుకురావాల్సిన పరిస్థితి తలెత్తి, రోగాలు సోకే అవకాశాలు మరింత పెరగుతున్నాయని రోగులు, సందర్శకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాత ఆసుపత్రి ప్రాంగణం నుంచి వంద పడకల ఆసుపత్రికి వెళ్లే మార్గమంతా వృధా నీటి నిల్వతో నిండిపోవడంతో అక్కడి సిబ్బంది కూడా ఎప్పటికప్పుడు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ఏడాది నుంచి ఈ సమస్య కొనసాగుతున్నా అధికారులు పట్టించుకోలేదని తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

డయాలసిస్ నీరు ఆసుపత్రి బయట నిల్వ ఉంచడం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తుండగా, "డయాలసిస్ కేంద్రం నుంచి వెలువడే వృధా నీటికి ప్రత్యేక ట్యాంక్ నిర్మించి, ఆసుపత్రి ఆవరణంలో నీరు నిల్వ కాకుండా చర్యలు తీసుకోవాలి" అని రోగులతో పాటు స్థానికులు జిల్లా వైద్యాధికారులను కోరుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి శాశ్వత పరిష్కారం తీసుకురావాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# నాణ్యమైన పంట సత్వరమే కొనుగోలు చేయాలి

### మంత్రి తుమ్మల నాగేశ్వర రావు





**ఖమ్మంబ్యూరో/ నవంబర్19(జర్నలిస్ట్ వార్త):**ధాన్యం, పత్తి పంటల కొనుగోలుపై సంబంధిత అధికారులతో సమీక్షించిన మంత్రి తుమ్మలనాణ్యమైన పంట సత్వరమే కొనుగోలు చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు.మంత్రివ తుమ్మల నాగేశ్వర రావు బుధవారం కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తో కలిసి ధాన్యం, పత్తి పంటల కొనుగోలుపై సంబంధిత అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలలో నాణ్యత పరిశీలించి కొనుగోలు చేసిన తర్వాత రైస్ మిల్లుల వద్ద ఎటువంటి కోతలు విధించడానికి వీలు లేదని స్పష్టం చేశారు. గన్ని బ్యాగులు, టార్పాలిన్ కవర్లు అందుబాటులో పెట్టుకోవాలని, ధాన్యం తేమ శాతం రాగానే వెంటనే కొనుగోలు పూర్తి చేసి రైస్ మిల్లులకు తరలించాలని అన్నారు. కౌలు రైతు వద్ద నుంచి కూడా పత్తి పంట మద్దతు ధరకు కొనుగోలు చేయాలని, ధాన్యం కొనుగోలు అనుసరిస్తున్న విధానాన్ని పత్తి పంట కొనుగోలుకు పాటించాలని అన్నారు. తేమ శాతం గ్రామాలలోనే చెక్ చేసుకునేలా చూడాలని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి. పుల్లయ్య, డిఎస్ఓ చందన్ కుమార్, డిసిఓ గంగాధర్, సివిల్ సప్లైస్ డి ఎం శ్రీలత, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో పరిచారిక పోస్టు భర్తీ



**భీమదేవరపల్లి/నవంబర్19 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ శ్రీ వీరభద్ర స్వామి దేవస్థానంలో ఖాళీగా వున్న రెగ్యులర్ పరిచారిక పోస్టు కోసం ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేశారు. అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించి రాత, మౌఖిక పరీక్షలు నిర్వహించారు. ఉత్తీర్ణత సాధించిన కొండూరి శశాంక్ భరద్వాజ్ పరిచారిక పోస్టుకు ఎంపిక కావడం జరిగిందని ఆలయ ఈవో కిషన్ రావు తెలిపారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వుల ప్రకారం బుధవారం పరిచారిక పోస్టులో జాయిన్ అయినట్లు తెలిపారు. ఆలయ కార్యాలయంలో నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు రాజయ్య, మొగిలిపాలెం రాంబాబు, తాటికొండ వీరభద్రయ్య, వినయ్, శ్రీకాంత్, సందీప్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ముల్కనూరులో ఘనంగా ఇందిరాగాంధీ జయంతి

### దేశ తొలి మహిళా ప్రధానిగా పేదరిక నిర్మూలనకు కృషి

### - కాంగ్రెస్ మండల అధ్యక్షులు చిట్టెంపల్లి ఐలయ్య



**భీమదేవరపల్లి/నవంబర్19 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ అంబేడ్కర్ కూడలిలో బుధవారం దేశ మాజీ ప్రధాని ఇందిరా గాంధీ 108వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షులు చిట్టెంపల్లి ఐలయ్య ఆధ్వర్యంలో ఇందిరా గాంధీ చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసారు. ఆయన మాట్లాడుతూ దేశ తొలి మహిళా ప్రధానమంత్రిగా ఇందిరమ్మ దేశంలో పేదరిక నిర్మూలన కోసం ఎనలేని కృషి చేశారని పేర్కొన్నారు. పేద ప్రజలకు అండగా నిలవడంతో పాటు, మహిళా సాధికారిత కోసం ఎంతగానో కృషి చేశారని కొనియాడారు. ఇందిరమ్మ పాలనలో బడుగు, బలహీన వర్గాలకు మేలు జరిగిందని పేర్కొన్నారు. కొత్తకొండ శ్రీ వీరభద్రస్వామి ఆలయ మాజీ ఛైర్మన్ కొమురవెల్లి చంద్రశేఖర్ గుప్తా, మహిళా కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు చిదురాల స్వరూప, పత్తిపాక కొమురెల్లి, జిల్లా నాయకులు పచ్చునూరి కరుణాకర్, వల్లెపు మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# వేలేరు వేదికగా జూనియర్ కబడ్డీ జోష్

### జోన్ ఎంపికలు ముగింపు

### -జిల్లా పోటీలకు సిద్ధం






**హనుమకొండ బ్యూరో /నవంబర్ 19 (జర్నలిస్ట్ వార్త):** ధర్మసాగర్%-%వేలేరు పరిధిలో జూనియర్ బాల%-%బాలికల కబడ్డీ ఎంపికలను బుధవారం సాయంత్రం నిర్వహించారు. హనుమకొండ జిల్లా కబడ్డీ సంఘం అధ్యక్షులు మహమ్మద్ అజీజ్ ఖాన్, ప్రధాన కార్యదర్శి ఆకుల సారంగపాణి ఆదేశాల మేరకు జోన్ స్థాయి ఎంపికలు పూర్తి చేసినట్లు సంఘం సంయుక్త కార్యదర్శి సద్దాం హుస్సేన్ తెలిపారు.వచ్చే ఆదివారం (23-11-2025) ఉదయం 8 గంటలకు వేలేరు జిల్లా పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాల మైదానంలో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు జరగనున్నాయని చెప్పారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు వచ్చే రాష్ట్రస్థాయి క్రీడల్లో జిల్లా తరపున ప్రాతినిధ్యం వహించనున్నారు.

అర్హతల వివరాలు ఇలావయస్సు ఇరవై సంవత్సరాల లోపు ఉండాలి. అంటే 31-12-2005 లోపు జననం కలిగిన వారే అర్హులు. 18-01-2006 తరువాత జననం అర్హత కాదని స్పష్టం చేశారు. బాలికలు అరవై అయిదు కిలోల లోపు, బాలురు డెబ్బై అయిదు కిలోల లోపు ఉండాలని నిర్వాహకులు తెలిపారు. రాష్ట్రస్థాయి షెడ్యూల్ ప్రకారం బాలికల పోటీలు డిసెంబర్ రెండు నుంచి నాలుగు వరకు నాగార్జునసాగర్‌లో, బాలుర పోటీలు డిసెంబర్ ఐదు నుంచి ఏడు వరకు మహబూబ్‌నగర్‌లో జరుగనున్నాయి.ఈ ఎంపికల్లో జిల్లా బాధ్యులు, మండల బాధ్యులు, శారీరక ఉపాధ్యాయులు, శిక్షకులు, క్రీడాధికారులు పాల్గొన్నారు. మండల కబడ్డీ సంఘం అధ్యక్షులు జెట్టి అరవింద్, ప్రధాన కార్యదర్శి ఇట్టబోయన వినయ్, ప్రవీణ్, విజయ్, శ్రీశైలంలు హాజరయ్యారు. ఎంపికలకు విచ్చేసే ఆటగాళ్లు పదో తరగతి ధృవపత్రం, ఆధార్ కార్డు తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు.

# గ్రామ గ్రామాన ముదిరాజ్ జెండా ఆవిష్కరించాలి

### . జనగాం జిల్లా అధ్యక్షుడు నీల గట్టయ్య ముదిరాజ్



**స్టేషన్ ఘన్ పూర్/నవంబర్ 19 (జర్నలిస్ట్ వార్త)** ఈనెల 21న ప్రపంచ మత్స్య కార్మిక దినోత్సవం సంద ర్భంగా గ్రామ గ్రామాన ముదిరాజ్ జెండా రెపరెపలాడా లని ముదిరాజ్ మహాసభ జనగామ జిల్లా అధ్యక్షుడు నీల గట్టయ్య పిలుపునిచ్చారు. నవంబర్ 21వ తేదీన తెలంగాణముదిరాజ్ మహాసభ ఆవిర్భావదినోత్సవం, ప్రపంచ మత్స్య కార్మికుల దినోత్సవం పురస్కరించుకొ ని స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ పరిధిలోని శివుని పల్లిలో గోడ పత్రిక ఆవిష్కరణ సమావేశానికి తెలంగా ణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర యువజన కార్యదర్శి గోరంట్ల యాదగిరి ముదిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహిం చడం జరిగింది. ఈ సమావేశానికి ముదిరాజ్ మహా సభ జనగామ జిల్లాఅధ్యక్షులు నీల గట్టయ్య ముదిరా జ్ ముఖ్య అతిదిగా హాజరై గోడ పత్రిక ఆవిష్కరించా రు. ఈ సందర్భంగా నీలగట్టయ్య మాట్లాడుతూ తెలం గాణ ముదిరాజ్ మహాసభ నవంబర్ 21, 2014లో తెలంగాణ శాసనమండలి డిప్యూటీ చైర్మన్, రాష్ట్ర అధ్యక్షుడు అయిన డాక్టర్ బండ ప్రకాష్ ముదిరాజ్ అధ్యక్షతన ఏర్పాటు చేయడం జరిగిందని, గత 68 సంవత్సరాలకు భిన్నంగా తెలంగాణ్ ముదిరాజ్ మహా సభ ఆవిర్భవించిన 11సంవత్సరాల కాలంలోనే ఎన్నో సమస్యలను పరిష్కరించు కోవడం జరిగిందన్నారు. తెలంగాణ ముదిరాజ్ మహాసభ జెండాను ముదిరాజు లు బలంగా ముందుకు తీసుకు పోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని దానికోసం ముదిరాజ్ జాతి ఐకమ త్యంగా ఉండాలని ప్రతి గ్రామంలో, మండలాలలో, నియోజకవర్గ స్థాయిలో ర్యాలీలతో, సంబరాలతో తెలంగాణ ముదిరాజ్ మహాసభ 11వ వార్షికోత్సవ వేడుకలు, ప్రపంచ మత్స్యకారుల దినోత్సవ వేడుకలు నవంబర్ 21 నాడు ఘనంగా నిర్వహించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జనగాం జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం డైరెక్టర్ భుర్ల శంకర్ ముదిరాజ్, శివునిపల్లి మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ప్రధా న కార్యదర్శి చెన్నూరి వెంకటేశ్వర్లు, ముదిరాజ్ కుల సంఘ నాయకులు చిక్కుడు రమేష్ , కొండ వేణు,పిట్టల శంకర్,బూర్ల కొమురయ్య, ఈశ్వర్, శివలింగం, అనిల్, తిరుపతి , అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# గణ్విత్ జన్మదినం: సేవతో వెలిగిన చిరునవ్వులు



**మధిర/నవంబర్ 18 (జర్నలిస్ట్ వార్త):** మాటూరుపేట వాసులు కొర్లగంటి సురేష్%-%వెన్నెల దంపతుల కుమారుడు గణ్విత్ జన్మదినాన్ని సేవామార్గంలో అర్థవంతంగా నిర్వహించారు. మధిరలోని మదర్ థెరిస్సా సేవాసదన మానసిక దివ్యాంగుల పునరావాస కేంద్రంలో అన్నదానం చేసి పుట్టినరోజు ఆనందాన్ని కేంద్రంలోని పిల్లలతో పంచుకున్నారు.గణ్విత్ ఆరోగ్యం, ఆయురారోగ్యాలు, విద్యాభివృద్ధి కోసం మానసిక దివ్యాంగ పిల్లలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చిన్నారి పుట్టినరోజును సేవా కార్యక్రమంతో జరపడం స్థానికుల్లో ప్రశంసలనందుకుంది.ఈ కార్యక్రమంలో పోతినేని అరుణ పాల్గొన్నారు. గణ్విత్ పుట్టినరోజును మంచి పనితో చిరస్మరణీయంగా చేసిన సురేష్%-%వెన్నెల దంపతులను గ్రామస్థులు అభినందించారు.

## బయ్యారం మండలంలో వడ్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభం..



**బయ్యారం/నవంబర్ 19(జర్నలిస్ట్ వార్త):** జిల్లా కలెక్టర్ ఆదేశాలనుసారం బుధవారం బయ్యారం మండల కేంద్రంలో,జగ్గుతండ,గంధంపల్లి సెంటర్స్ లో వడ్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినట్లు సొసైటీ సీఈవోసురేందర్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తాము పండించిన ధాన్యాన్ని దళారులకు అమ్మి నష్టపోవద్దని ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యాన్ని అమ్మి ప్రభుత్వం నిర్దేశించిన మద్దతు ధరతో పాటు బోనస్ పొందాలన్నారు.ఈ కార్యక్రమంలో మన్నింటరింగ్ ఆఫీసర్ నరేందర్,ఏఈఓ ఫయాజ్,సెంటర్ ఇంచార్జ్ సతీష్,ట్యాబ్ ఆపరేటర్ గణేష్,రైతులు హమాలీ పాల్గొన్నారు.

## ఇందిరాగాంధీ దేశానికి చేసిన సేవలు మరువలేం.

### -సొసైటీ చైర్మన్ మూల మధుకర్ రెడ్డి



**బయ్యారం/నవంబర్ 19(జర్నలిస్ట్ వార్త):** బయ్యారం మండల కేంద్రంలోభారతదేశ తొలి మహిళా ప్రధాని ఇందిరా గాంధీ 109వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా బయ్యారం మండల సోసైటీ చైర్మన్ మూల మధుకర్ రెడ్డి మాట్లాడుతూ ఇందిరాగాంధీ ప్రధానిగా దేశంలో అనేక మార్పులు తెచ్చి అభివృద్ధికి దోహదపడ్డారన్నారు.ఆమె తీసుకున్న విప్లవాత్మక నిర్ణయాల వల్లే ఈరోజు దేశం ప్రపంచ దేశాల స్థాయిలో అగ్రగామిగా నిలిచిందన్నారు. బ్యాంకులను జాతీయం చేయడం, హరిత విప్లవం,గరీబీ హటావో అని నినాదంతో ముందుకువెళ్లిన నాయకురాలు ఇందిరాగాంధీ అని ఆయన పేర్కొన్నారు.పేదరికాన్ని నిర్మూలించాలని నెహ్రూ ఆశయం మేరకు ఇందిరాగాంధీ 20 సూత్రాల పథకం తీసుకొచ్చారన్నారు.ఇందిరా గాంధీ చేసిన సేవలు దేశం ఎన్నటికీ మరువలేమన్నారు.ఈ కార్యక్రమంలో రాసామల్ల నాగేశ్వరరావు,వీరారెడ్డి,వెంకటపతి,బానోతు నాగరాజు,సుమన్,భాస్కర్ రెడ్డి, బాబు,దూదిమెట్ల లింగయ్య,అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## గంధంపల్లిలో మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి వేడుకలు.



**బయ్యారం/నవంబర్ 19(జర్నలిస్ట్ వార్త):** దివంగత మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి భూక్యా ప్రవీణ్ నాయక్ ఆధ్వర్యంలో కొత్తపేట గంధంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఊరకుంట వద్ద బుధవారం ఘనంగా నిర్వహించారు.ప్రవీణ్ నాయక్ ఇందిరమ్మ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ప్రవీణ్ నాయక్ మాట్లాడుతూ దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన వీరవనిత, సంక్షోభాలను సవాళ్లను స్వీకరించి గెలిచిన ఉక్కు మహిళ ఇందిరా గాంధీ అని కొనియాడారు.కాంగ్రెస్ పార్టీ ద్వారానే దేశాభివృద్ధి,సమాజ ప్రగతి సాధ్యపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కారుబోతుల రామ్మూర్తి,జూలకంటి సీతారామరెడ్డి, చల్లా సురేష్,కొలిపాక రవి,గట్టు శ్రీను, గుర్రం అన్నపూర్ణ,రాందాసు, చెరుకుపల్లి రవి,పుల్లూరి బాలరాజు,భూక్య శ్రీను,కొండ సంతోష్, బోడ సాయి కృష్ణ,పున్నం రామయ్య, ముత్తంశెట్టి రవి,చారి అన్న,విజయ్, సత్యం మేస్త్రి,వీరన్న,మురళి స్వామి, రంగు రామదాసు,దేశినేని శ్రీను,భూక్య శ్రీను,సతీష్,దుర్గ ప్రసాద్,పెనుగొండ నరేష్,టీవి ప్రసాద్,తదితరులు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

## - మార్కెట్ కమిటీ చైర్మన్ బోళ్ల గంగారావు





**వైరా/నవంబర్ (జర్నలిస్ట్ వార్త):** వైరా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో లయన్ నూకల శ్రీనివాసరావు జన్మదినాన్ని సేవా కార్యక్రమాలతో ఘనంగా నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు వై. బుచ్చిరామారావు పర్యవేక్షణలో జరిగిన ఈ వేడుకలో వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య నూకల వాణిశ్రీ దంపతులకు ఆశీర్వచనాలు అందాయి. అనంతరం కేక్ కటింగ్ జరిగింది.కార్యక్రమంలో వేదపాఠశాల వారికి బియ్యం, కూరగాయలు అందజేశారు. అదేవిధంగా వేదపాఠశాల పిల్లలకు దుప్పట్లు, నిరుపేదలకు 40 రగ్గులను క్లబ్ తరఫున పంపిణీ చేశారు. ఈ సందర్భం గా మార్కెట్ కమిటీ చైర్మన్ బోళ్ల గంగారావు మాట్లాడుతూ, "గత 20 ఏళ్లుగా వైరా లయన్స్ క్లబ్ ప్రజలకు అండగా నిలుస్తూ అనేక సేవా కార్యక్రమాలు చేపడుతోంది. సభ్యుల పుట్టినరోజులు, పెళ్లిరోజులలాంటి ప్రత్యేక సందర్భాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించడం ప్రశంసనీయం. విద్యార్థులు, నిరుపేదలు, అవసరమైన వారందరికీ అందిస్తున్న సేవలు ఎంతో శ్లాఘనీయమైనవి" అని అన్నారు.ఈ కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు వనమా విశ్వేశ్వరరావు, ఆర్యవైశ్య కళ్యాణ మండపం అధ్యక్షులు డా. పెరుమాళ్ల కృష్ణమూర్తి, మాజీ ఎంపీపీ కట్టా కృష్ణార్జునరావు, చింతలపూడి వెంకటేశ్వరరావు, నూకల ప్రసాదరావు, అన్నపూర్ణ, గజ్జల కృష్ణమూర్తి, మణి, మిట్టపల్లి కిరణ్‌కుమార్, రంగా రమేష్, మిట్టపల్లి రాఘవరావు, సంగిశెట్టి వెంకటేశ్వర్లు, కొణతాలపల్లి సుబ్బారావు, కొణతాలపల్లి నగేష్, పోశం శ్యాంకుమార్, ఎండ్రపూడి శంకర్, రంగా సింహాద్రి తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

## బయ్యారం యునాని వైద్యశాలలో మాదక ద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ.




**బయ్యారం/నవంబర్ 19(జర్నలిస్ట్ వార్త):**నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం ప్రారంభమై ఐదు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగాతెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మాదక ద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞను బయ్యారం ప్రభుత్వ యునాని వైద్యశాలలో డాక్టర్ శంకర్ ఆధ్వర్యంలో ఆసుపత్రి సిబ్బంది కి గ్రామంలో యువకుల చేతమాదక ద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో ప్రజలు,యువకులు తదితరులు పాల్గొన్నారు.

## బయ్యారం మొక్కజొన్న కొనుగోలు కేంద్రం తనిఖీ.

### -వ్యవసాయ అధికారి కే.రాజు.

**బయ్యారం/నవంబర్ 19(జర్నలిస్ట్ వార్త):**



బయ్యారం సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని మండల వ్యవసాయ అధికారి కే.రాజు ఆకస్మికంగా సందర్శించారు.ఈ సందర్భంగా ఏఓ రైతులతో మాట్లాడి,వారికి అందిస్తున్న సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు.మొక్కజొన్న సేకరణ కేంద్రంలో రైతుల నుండి సేకరించిన మొక్కజొన్న నిల్వల నాణ్యతను స్వయంగా పరిశీలించి,కొనుగోలు ప్రక్రియ సక్రమంగా జరుగుతున్నదా అనే అంశాన్ని పరిశీలించారు. తేమశాతం యంత్రం సహాయంతో పరీక్షించి,పంట నాణ్యతను అంచనా వేశారు.కొనుగోలు కేంద్రంలో తేమశాతం ప్రమాణాలు సరిగ్గా పాటించబడుతున్నాయా లేదా అనే విషయాన్ని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.పంట తేమ శాతం,నాణ్యత ప్రమాణాలపై సిబ్బంది స్పష్టమైన అవగాహనతో పని చేయాలని, రైతులకు తగిన ధర లభించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన మొక్కజొన్న ఆన్లైన్ వివరాల నమోదు ప్రక్రియను ఏఓ పరిశీలించారు.రైతులు ఎదుర్కొంటున్న చిన్నచిన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు.ఈ కార్యక్రమలో ఏఈఓ ఫయాజ్,సెంటర్ ఇంచార్జ్ సతీష్,ట్యాబ్ ఆపరేటర్ గణేష్,రైతులు, హమాలీలు తదితరులు ఉన్నారు.

# పీఎం కిసాన్ - అన్నదాత సుఖీభవ నిధులు రైతులకు విడుదల

### వైసీపీ హయాంలో ఆర్థిక విధ్వసం

### గాడిన పెట్టి ముందుకెళ్తున్నాం

### సంక్షేమం, అభివృద్ధి సమపాళ్లతో సాగుతున్నాం

### రైతులు సేంద్రియ వ్యవసాయంతో సాగాలి

### పంటలను విదేశాలకు ఎగుమతి చేసే దశ రావాలి

### అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో సిఎం చంద్రబాబు



**కడప,నవంబర్ (జర్నలిస్ట్ వార్త):** వైసీపీ హయాంలో ఆర్థిక విధ్వసం జరిగిందని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మరోమారు పునరుద్ఘాటించారు. తాము తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితులు చక్కదిద్దుతున్నామని తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేస్తున్నామని, సూపర్ సిక్స్ సూపర్ హిట్ అయిందని చంద్రబాబు చెప్పారు. సంక్షేమం, అభివృద్ధి సమపాళ్లలో ముందుకు తీసుకుని వెళుతున్నామని అన్నారు. కడప జిల్లాలో అన్నదాత సుఖీభవ నిధుల విడుదల కార్యక్రమంలో చంద్రబాబు పాల్గొన్నారు. తాను కూడా రైతు బిడ్డనే అని చెప్పిన చంద్రబాబు, తనకు రైతుల సమస్యలు బాగా తెలుసని చెప్పారు. రైతులను ఆదుకునేందుకు రాష్ట్రంలో అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేస్తున్నామని చంద్రబాబు వెల్లడించారు. కడపజిల్లా పెండ్లిమర్రిలో ఈ సాయంత్రం నిర్వహించిన రచ్చబండ లో పాల్గొన్న సీఎం చంద్రబాబు.. పీఎం కిసాన్ – అన్నదాత సుఖీభవ నిధులు రైతులకు విడుదల చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు పలు అంశాలు వెల్లడించారు. ఎన్నికల ముందు సూపర్ సిక్స్ హామీలు ఇచ్చి అమలు చేశామని చంద్రబాబు అన్నారు. సూపర్‌సిక్స్ సాధ్యమేనా అని ప్రశ్నించారు.. సూపర్‌సిక్స్ హామీలను సూపర్‌హిట్ చేశాం అన్నారు. రెండో విడత పీఎం కిసాన్ – అన్నదాత సుఖీభవ నిధులు విడుదల చేశాం అన్నారు. రాష్ట్రంలో 47 లక్షల మంది రైతులకు రూ.3,200 కోట్లు జమ చేసినట్లు వెల్లడించారు. ఒక్కో రైతు ఖాతాలో రూ.7 వేలు చొప్పున జమ చేశామని అన్నారు. 2024 జనవరి 19న 'రా కదిలి రా' కార్యక్రమం కోసం కమలాపురం వచ్చాను.. నాడు ఏ ఉత్సాహంతో ఉన్నారో.. ఇప్పుడూ అదే ఉత్సాహంతో ఉన్నారు.కడపలో నిర్వహించిన మహానాడును విజయవంతం చేశారు.మహానాడు ద్వారా కడప గడ్డపై టీడీపీ సత్తా ఏంటో నిరూపించారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా హామీలు అమలు చేస్తున్నాం అని అన్నారు. అయితే రైతులు ప్రకృతి సేద్యంపై దృష్టి పెట్టి లాభాలు పెంచుకోవాలని సూచించారు. మనం పండించిన పంటలను ఇతర దేశాలకూ ఎగుమతి చేయాలి,ఇతర దేశాలకు ఎగుమతి చేస్తేనే రైతులకు ఆదాయం వస్తుంది,పాత పద్ధతిలోనే వ్యవసాయం చేస్తామంటే.. రైతులకు ఇబ్బందులు వస్తాయన్నారు. రైతుల అభివృద్ధి కోసం పంచ సూత్రాలు తీసుకొచ్చాం..పంచ సూత్రాలను రైతులు అమలు చేస్తే.. సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది. రైతులు డిమాండ్ ఆధారిత పంటలను సాగు చేయాలన్నారు. డబల్ ఇంజిన్ సర్కార్‌తో రాష్ట్రంలో ఎప్పుడూ లేని అభివృద్ధి చేస్తున్నాం అని వివరించారు. రాష్ట్ర పునర్నిర్మాణం కోసం జనసేన, బీజేపీతో కలిసి పనిచేస్తున్నాం అని అన్నారు. నేనూ రైతుబిడ్డనే.. మా నాన్నకు వ్యవసాయంలో సహాయం చేసేవాడిని. ఎన్ని ఇబ్బందులొచ్చినా.. నదుల అనుసంధానం పూర్తి చేస్తా..నదుల అనుసంధానం పూర్తి చేసి.. అన్ని ప్రాంతాలకు నీళ్లు ఇస్తాం,రైతులకు రూ.10 వేల కోట్ల విలువైన విద్యుత్‌ను ఉచితంగా ఇస్తున్నాం. రాయలసీమలో పుట్టాను.. రాయలసీమ ప్రజల కష్టాలు తెలుసు అన్నారు. సాగునీటి ప్రాజెక్టులు విస్మరిస్తే రాయలసీమ ఎడారి అవుతుందన్నారు, రాయలసీమ ప్రజల్లో ఆశలు చిగురింపచేసిన వ్యక్తి ఎన్టీఆర్ అన్నారు.

---

## ఉద్యోగుల వేతనాలు నిలుపుదల

## 20న చలో హైదరాబాద్

### రెండు నెలలుగా జీతం లేక ఇబ్బందులు- వెంటనే చెల్లించాలని డిమాండ్




**హనుమకొండ బ్యూరో/ధర్మసాగర్ నవంబర్19 (జర్నలిస్ట్ వార్త):**నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్హెచ్ఎం) కింద కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఉద్యోగులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సెప్టెంబర్, అక్టోబర్ నెలల రెండు నెలల వేతనాలు అందక కుటుంబాలు క్లేశాల్లో కూరుకుపోయాయని జేఏసీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాదు ఏడు నెలల పిఆర్సీ బకాయిలు కూడా పెండింగ్‌లోనే ఉన్నాయని తెలిపారు. తమ సమస్యల పరిష్కారం కోసం 20న ఉదయం 11 గంటలకు హైదరాబాద్ కోటి వద్ద మహా ధర్నా నిర్వహించనున్నట్టు ప్రకటించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి ఎన్హెచ్ఎం 78 క్యాడర్ల ఉద్యోగులు మహా ధర్నాకు హాజరవుతారని తెలిపారు. ధర్మసాగర్ మండలంలో ధర్నాకు వెళ్లే ముందు మెడికల్ ఆఫీసర్‌కు వినతిపత్రం అందజేశారు. వేతనాలు, పిఆర్సీ బకాయిలు వెంటనే విడుదల చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో పల్లె దవఖాన వైద్యులు, నర్సింగ్ ఆఫీసర్లు, ఫార్మసిస్టులు, ఏఎన్ఎంలు, ఇతర పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.